# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





# -34-

## అమెరికాళ్ళ నొప్పులూ, అమెరికాయాసాలూ కథ

**ఏ మాట కామాటే** చెప్పుకోవాలీ అంటే, ఎప్పటిలాగానే ఈ ఏడు నా సాహిత్య మమకారం బాగానే ఉంది కానీ వ్యక్తిగత ఆరోగ్య పరంగా ఈ 'వికారి' నామ సంవత్సరం కాస్త వికారంగానే ఉంది.

అనగా....గత ఆరు నెలలలో ఏదో ఒక వంక పెట్టి నేను సుమారు పది రోజులు అమెరికాసుపత్రులలో అమెరికాలక్షేపం చేసినప్పుడు కొన్ని ప్రగాఢమైన విషయాలు దగ్గరగా ఉండి గమనించాను. ఏదో నా అనారోగ్యాలని టాం టాం చేసుకుని, దానికి FB లో లైకులూ, అయ్యో, కుయ్యో అని కామెంట్లూ కొట్టించేసుకుని, మా క్వీన్ విక్టోరియా దగ్గర భుజాలు ఎగరేసుకుందాం అనే దురాలోచన నాకు లేనే లేదు. అయితే మన అనుభవాలు చేదు అయినా సరదాగా నలుగురితోటీ పంచుకుంటే ఆ సమాచారం ఎవరికైనా ఉపయోగపడుతుందేమో అని నా ఆశ. ఉదాహరణకి సుమారు ముప్ఫై ఏళ్ళ క్రితం ఇలాగే నేను వ్రాసిన "అత్త గారూ, హార్ట్ ఎటాకూ" అనే కథలో అమెరికాలో కూడా ఉచిత వైద్యం అందుతుంది సుమా అనే వాస్తవ సమాచారం చాలా ఉపయోగపడింది అని నాకు చాలా మంది చెప్పారు. గత ఏడాది నుంచీ నాకున్న సమస్య అల్లా కాస్త నడవగానే కొంచెం అమెరికాయాసం, మరి కొంత అమెరికాళ్ళ నొప్పులూ మాత్రమే. అంతా చికాకు వ్యవహారమే కానీ ప్రాణాంతకం కాదు..నాకే కాదు ఎవరికైనా సరే. కానీ వాటికి శారీరిక పరమైన కారణాలు కనుక్కుని నివారించుకోక పోతే రంభా, ఊర్వశీ కనపడే అవకాశాలు ముంచుకు రావచ్చును. వాళ్ళని ఇప్పుడప్పుడే చూసే అవసరం, ఆసక్తీ నాకు లేవు. చచ్చినట్టు వాళ్ళు కొన్నాళ్ళు ఆగవలసిందే!.

అసలు ఈ అమెరికాయాసం, అమెరికాళ్ళ నొప్పులూ ఎందుకు వస్తాయీ అని మా అమెరికా ప్రద్ధతి ప్రకారం మా ప్రైమరీ కేర్ డాక్టర్..అంటే ప్రధాన వైద్యులని అడిగితే ఏమో, "అది నా డిపార్ట్మెంట్ కాదు" అని మరో అమెరికార్డియాలజిస్ట్ దగ్గరకి వెళ్ళమని హుకుం జారీ చేశారు.

ఆయనేమో "నాకంటే న్యూరాలజిస్ట్ కి బాగా తెలుసు" అనగానే అక్కడికి వెళ్ళాను.

"అబ్బే, నేను నరాల మనిషిని. ఆ శ్వాసకోశం డాక్టర్ దగ్గరకి వెళ్ళు" అని ఇలా ఒకరు తంతే, ఇంకొకరి దగ్గరకి వెళ్ళినప్పుడు "అమెరికాలో ఏ డాక్టర్ దగ్గర నుంచి అయినా ఆ వెధవ కంప్యూటర్ లాగి పారేస్తే ఇక వాళ్ళకి మాట పెగలదు." అని నేను గమనించిన ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఇక్కడి పద్ధతి ప్రకారం నేను ఏ డాక్టర్ దగ్గరకి వెళ్ళదల్చుకున్నా వారం రోజులు ముందు రక్తదానం చెయ్యడం, ఆ గేలన్ రక్తాన్నీ వాళ్ళ టెక్నీషియన్ చీల్చి చెండాడి అందులో టూత్ పేస్ట్ లో ఉప్పు ఎంతా లాగా సోడియం ఎంతా, పొటాషియం ఎంతా, బంగారం, రాగి, మట్టీ, మశానం శాతం ఎంతో కనిపెట్టేసి ఆ డాక్టర్ తాలూకు కంప్యూటర్ లో ఆ సమాచారం పెడతారు. తీరా మనం వెళ్ళాక నాలుగు గంటలు వైటింగూ...ఆ తర్వాత సదరు డాక్టర్ ఎదురుగుండా మొహం వేళ్ళాడేసుకుని...ఆవిడ మొహం కాదు..మనదే....వేళ్ళాడేసుకుని

కూచున్న పేషెంట్ ..అంటే ఎవరో కాదు..నేనే... (నిజానికి ఇక్కడ "రోగి" అని మామూలు తెలుగులోనో "వ్యాధి గ్రస్తుడు" అని గ్రాంధికంలోనో వ్రాయాలి కానీ జగన్ గారి ఆదేశాల మేరకు ఇంగ్లీష్ మీడియం లో పేషెంట్ అయితేనే కాస్త తేలిగ్గా ఉంటుంది కదా అని అలా అంటున్నాను....). ఇక నేను ఆడో, మగో, పొట్టో, పొడుగో, కనీసం అందగాడినో కాదో కూడా గమనించకుండా ఆ డాక్టర్ గారు కంప్యూటర్ తో మంతనాలు ఆడుతూ కూచుంటారు. అంతకీ ఒకటి రెండు సార్లు 'నొప్పి బాబోయ్" అని ఓవర్ ఏక్షన్ చెయ్యగానే ఇక చూసుకోండి బాబోయ్..ప్రశ్నల వర్షమే...అవి ఈ క్రిందన ఇచ్చాను.

నొప్పి ఎక్కడా?, పొట్టలోనా, కాళ్ళ లోనా, వెన్నెముకా? గుండెకాయా? నీ ఒక్కడికేనా, లేక మీ క్వీన్ విక్టోరియా కి కూడా అదే నొప్పి ఉందా? ఆ నొప్పి అలా వస్తూ పోతూ ఉంటుందా? లేక పోతూ వస్తూ ఉంటూందా? పై నించి కాళ్ళ కా, కాళ్ళ నుంచి పైకా?, ఎడం వేపా, కుడి వేపా? చెమట్లు పడతాయా? పడితే ఎన్ని బొట్లు? నొప్పి ముందా, చెమట్లు ముందా?, నొప్పి రాగానే కూచుంటావా? కూచోగానే తగ్గుతుందా? నడిస్తే వస్తుందా, నుంచోగానే వస్తుందా? లేక నొప్పి రావాలంటే పడుకోవాలా? పడుకున్నప్పుడు కూడా నొప్పి, ఆయాసం వస్తాయా? ఇలా డాక్టర్ అడుగుతున్న ధారావాహిక ప్రశ్నలకి మన సమాధానాలు పక్కనే ఉన్న నర్సమ్మ కంప్యూటర్ లోకి ఎక్కించేస్తూ ఉంటుంది. దాంతో ఆ కంప్యూటర్ కి కూడా నొప్పులూ, ఆయాసాలూ వచ్చి పొగలు గక్కుతూ ఉంటుంది.

అన్నింటికీ మించిన చచ్చు ప్రశ్న "సున్నా నుంచి పది అంకెలలో నీ నొప్పి ది ఏ సంఖ్య?" అలా అంటూ నవ్వుతూ ఉన్న మొహం బొమ్మ చూపించి అది సున్నా నొప్పి అనీ,,,అలా ఆ మొహం ముడుచుకుంటూ పోయి అరివీర భయంకరంగా ఉన్న ఆఖరి బొమ్మ సంఖ్య 10 అనీ ఒక డాక్టర్ అడగగానే నాకు ఒక నోబెల్ బహుమతి కొట్టేసే ఒక అవిడియా వచ్చేసింది. అంటే....ఆ డాక్టర్ స్టేతస్కోప్ తొ మన గుండె లప్ డప్ వింటున్నట్టుగా మనం నొప్పికి ఒక యంత్రం కనిపట్టాలి....దాని ప్రకారం మనకి నొప్పి ఉన్న చోట తన చెయ్యి పెట్టగానే ఆ నొప్పి యదాతధంగా ఆ లప్ డప్ వినిపించినట్టు ఆ డాక్టర్ కి నొప్పి పెట్టాలి. అంటే మనకి నడుం నొప్పి అయితే ఆ డాక్టర్ కి కూడా నడుం నొప్పి అదే చోట, అదే స్థాయిలో రావాలన మాట! అప్పుడు దాని సంఖ్య అయిదో, పదో డాక్టర్ కి తెలిసిపోతుంది కదా! అలాంటి యంత్రం నేను కనిపెడితే ఇక్కడ నొబెల్ బహుమతి, అక్కడ అఖిల స్థాయిలో భారత రత్న, రాష్ట్ర స్థాయిలో కులాలే ముఖ్యం కాబట్టి బ్రాహ్మణ భ్రష్ట...సారీ...స్రష్ట...... లాంటి బిరుదులు రాక చస్తాయా?

ఈ తతంగం అన్నింటిలోనూ, నేను గమనించిన మరొక అంశం పక్క, పక్క ఆఫీసులలోనే ఉన్నా, "అమెరికా డాక్టర్లు ఒకరితో ఒకరు మాట్లాడుకోరు" ఒకరి నించి ఇంకొకరికి మనం అడిగితే తప్ప మన రోగం తాలూకు కాగితాలు ఇంకొకరికి పంపించరు. అనగా మనకి ఉన్న రోగాలు ఏ డాక్టర్ వి ఆ డాక్టరివే. ఉదాహరణకి, ఇంకా రాలేదు కానీ, నాకు హార్ట్ ఎటాక్ వచ్చి ఆసుపత్రిలో చేరితే నా కార్డియాలజిస్ట్ కి కానీ, మిగతా డాక్టర్లకి కానీ తెలియనే తెలియదు. మరొక గొప్ప విషయం, మొన్న ఎక్కడో చదివినట్టు "American Health Care System works perfectly when you are in perfect health". అనగా... "మీరు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నంత కాలం, అమెరికా వైద్య వ్యవస్థ, ఇన్స్యూరెన్స్, మెడికేర్ వగైరాల అద్భుతంగా పని చేస్తాయి. కాస్త అనారోగ్యం వచ్చిందో....అంతే సంగతులు. కానీ తీరా ఆసుపత్రిలో చేరితే అటు అమెరికా అధ్యక్షుడి నుంచి నా లాంటి సర్వ సాధారణ వ్యక్తికీ ఉన్నత స్థాయిలో వైద్యం అందిస్తారు........ఇన్స్యూరెన్స్ అమ్మాయి ఎకౌంట్ చూసీ, మాల్ ప్రాక్టీస్ దావాల లాయర్ అనుమతీ ఇస్తే మాత్రమే...డాక్టర్ మీకు ఎమ్మారై, కేట్ స్కాన్, అల్ట్రాసౌండ్,..ఇలా చిన్నా, చితకాఅ ఏ టెస్ట్ చెయ్యాలన్నా ఆ ఇద్దరి అనుమతీ పొందాల్సిందే.....ఇండియాలో అయితే హాయిగా డబ్బున్న వారిని అందలం ఎక్కించి, లేని వారిని మెడపట్టి బయటకి గెంటేస్తారు.....ఏ దేశం గొప్పతనం ఆ దేశానిదే.

మరొక తమాషా.....అమెరికాలో నాకు ఎప్పుడు చిన్నా, పెద్దా సర్జరీలు జరిగినా ఆ సర్జన్ ని ఆపరేషని కి ముందు మూడు నిముషాలూ, తర్వాత మరో మూడు నిముషాలూ మాత్రమే చూశాను. ఇండియా లో లోగా తరవాత ఏడాది పాటూ ఆయనకి మామిడి పళ్ళ బుట్టలూ, బెల్లం

తట్టలూ పంపిద్దాం అనుకుంటే ఆ డాక్టర్ ఆచూకీ తెలియదు. అంతా న ఇంతకీ నాకు జరిగిన ముచ్చటగా మూడే!. జులై లో సరదాగా వెన్నెముకకీ, నవంబర్ లో అంత కన్నా సరదాగా అదేదో ఏంజియో ట...అది చేసి, అక్కడెక్కడో ఓ రక్తం గొట్టాం లో 80 శాతం అడ్డుగోడ ఉందిట, దానికి విరుగుడుగా అదేదో స్టెంట్ ట...అదీ, ఆ తర్వాతి వారం నా గుండె కాయ లప్పూ...డప్పూ అంటూ నీరసంగా తెలుగు మీడియం లో కాకుండా లప్, డప్ అని ఇంగ్లీష్ మీడియం లో కొట్టుకోడానికి అదేదో పేస్ మేకర్ ట...అదీ పెట్టి నా బాడీ రిపేర్లు చేశారు. ఇందాకా చెప్పినట్టు ఈ సర్జన్ లు, నా డాక్టర్లూ ఒకరి తో ఒకరు మాట్లాడుకోరు కాబట్టి ఆ బాధ్యత నేనే తీసుకుని, అన్నీ అనుసంధానం చేసుకుని ప్రస్తుతానికి అమెరికాళ్ళ నొప్పులూ, అమెరికాయాసాలూ తగ్గించుకున్నాను. అలా అని ఒలింపిక్స్ లో పరిగెట్టే ఆలోచన ఏమీ లేదు సుమా!

ఇక ఆఖరి సారిగా.... వయసు రీత్యా వచ్చే నొప్పులూ, ఆయాసాల సమస్యలకి ఈ స్టెంట్ లూ, పేస్ మేకర్లూ, గురించి సమాచారం అందరికీ కాస్తో, కూస్తో తెలిసినదే. అలాగే చాలా మందికి కాస్తో, కూస్తో ఉన్నా, లేనట్టు ఉండే మరో రకం అవలక్షణం "నిద్ర సరిగ్గా పట్టడం లేదు". దానికి జగనన్న మీడియం లో ఒక పేరు ఉంది కానీ, నాకు తెలిసీ తెలుగు మీడియం లో లేదు. గురక పెట్టడం అందులో ఒక భాగం మాత్రమే. మరో భాగం కాస్త సీరియస్ అనుకుంటాను. అదేదో వచ్చే నెల వివరిస్తాను..

అన్నట్టు గురక అంటే జ్ఞాపకం వచ్చింది...

అక్కడ ఆంధ్ర ప్రదేశ్ లో జగనన్న గారి ధర్మమా అని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో కూడా తెలుగు మీడియం పూర్తిగా ఎత్తేసి ఆంగ్ల మీడియం పెట్టగానే ఇనాళ్ళూ నిద్ర పోయిన అటు దిన పత్రికల వారూ, టీవీల వారూ, రాజకీయ నాయకులూ..అందరూ హఠాత్తుగా తెలుగు భాష గురించి ధైర్యంగా, పబ్లిక్ గానే మాట్లాడుకోవడం, చర్చించుకోవడం మొదలు పెట్టారు. వాళ్ళలో వాళ్ళకి మాత్రమే వినిపించే మేధావి వర్గాల 'గుంపులో గురక' స్థాయి కాస్త పెరిగింది. కానీ ఇదంతా జగనన్న తాంబూలాలు ఇచ్చేశాక అందరూ తన్నుకు చావడం క్రిందే వస్తుంది. చంద్రన్న హయాం లో చప్పుడు చెయ్యకుండా తవ్విన గోతిని జగనన్న హయాం లో పూడ్చి, పైన సిమెంటూ, కాంక్రీటూ వేసేసి తెలుగు భాష సమాధిని పూర్తి చేసి చరితార్థులు అయ్యారు. అమరావతిలో పూర్తి అయిన శాశ్వత కట్టడం బహుశా ఇదొక్కటే! అందుకే కదా మంత్రి బొత్స గారు అమరావతిని 'శ్మశానం" అని అన్నారు. ఎటు నుంచి ఎటు చూసినా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పరంగా మొత్తం తతంగం అంతా కూడా 'వికారం' గానే ఉంది.

**COMMENTS**